
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

5★★ జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025



పెగడపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

వినాయకా.. సెలవిక..

● అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జన వేడుకలు ● భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



మల్యాలలో వినాయకులను నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు



చింతకుంట చెరువులో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

గణపతి బొప్ప మోరియా.. జై బోలో గణేష్ మహరాజ్‌కి.. జై.. వినాయకా.. వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య మళ్లీ రావయ్యా.. అంటూ భక్తులు బొజ్జ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. నవరాత్రులు విశేష పూజలందుకున్న గణనాథుడు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలు, మహిళల కోలాటం, ఒగ్గుడోలు నృత్యాలు, భజనలు మంగళహారతులతో శోభాయాత్ర నయనానందకరంగా సాగింది. జగిత్యాల పట్టణంలో ఉదయం నుంచే గణపతుల శోభాయాత్ర ప్రారంభమైంది. భక్తులు శోభాయాత్రకు తరలిరావడంతో టవర్, చింతకుంట చెరువు ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

8లో



జగిత్యాలలో భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ



రాయికల్ మండలం రామాజీపేటలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



జగిత్యాలలో



వెల్గటూర్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



జగిత్యాల పట్టణంలో శోభాయాత్ర

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కొడిమ్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు గిరిప్రదక్షిణ, గోపూజ చేశారు. అనంతరం స్వామివారికి పల్లకిసేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

మల్యాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిపల్లిలో గల పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాభిషేకం చేశారు. స్వామి వారి శ్రావణ నక్షత్రం పురస్కరించు కొని శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వికాస్ శుక్లా, విజయ్ సముద్రాల ఆధ్వర్యంలో ప్రత్యే క పూజలు చేశారు. మరాఠి సత్తయ్య, భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూకు కొత్త కళ



- పూర్వ వైభవం సంతరించుకోనున్న శాఖ
- వీఆర్‌వో, వీఆర్‌ఏల స్థానాల్లో గ్రామ పరిపాలన అధికారుల భర్తీ
- జిల్లాలో 146 మంది జీపీవోల ఎంపిక
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పూర్వ ఉద్యోగులు

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వ్యవస్థకు పూర్వవైభవం రానుంది. గ్రామాల్లో పని చేసిన వీఆర్‌ఏ, వీఆర్‌వోలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలగించింది. జిల్లాలో వందల సంఖ్యలో వీఆర్‌వో, వీఆర్‌ఏలు పనిలేకుండా కొంతకాలం కూర్చున్నా అనంతరం వివిధశాఖల్లో వారిని భర్తీ చేశారు. మాతృ సంస్థను వదిలి ఇతర శాఖల్లో పనిచేయలేక పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపైనే పని భారం ఎక్కువైంది. గ్రామస్థాయిలో ఏదైన సమస్య ఎదురైతే విచారించడం కష్టంగా మారింది. వీఆర్‌వోలు లేకపోవడంతో ప్రజలు సైతం అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం రెవెన్యూ వ్యవస్థను గ్రామస్థాయి నుంచి పటిష్ఠ పరుస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ధరణిస్థానంలో భూ భారతిని తీసుకొచ్చింది. ఇప్పుడు పల్లెల్లో గ్రామ పరిపాలన అధికారులను (జీపీవో) నియమించింది.

● జీపీవోలుగా వీఆర్‌వో, వీఆర్‌ఏలు...

వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలను తిరిగి గ్రామ పరిపాలనాధికారులుగా నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి మాతృ సంస్థలోకి వెళ్లాలనుకునే వారికి విద్యార్హతలు, అనుభవం తదితర కొన్ని నియమ నిబంధనలు పెట్టి గ్రామ పరిపాలన అధికారుల నియామకంకోసం పరీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి 146మంది ఎంపికయ్యారు. వీరితో పాటు ఇతర ప్రాంతాలనుంచి మరో నలుగురు జీపీవోలు రానున్నారు. వీఆర్‌ఏల స్థానంలో జూనియర్ అసిస్టెంట్లుగా 84మందిని నియమించారు. మొత్తంగా 230మంది ఒకటి, రెండురోజుల్లో విధుల్లో చేరనున్నారు. రెవెన్యూ గ్రామాలను బట్టి ఒక్కో గ్రామ పరి పాలన అధికారికి రెండు, మూడుగ్రామాల బాధ్యతలు అప్పగించడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

● 218 క్లస్టర్లలో 146 మంది..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలో 20మండలాల్లో గల 300రెవెన్యూ గ్రామాలను 218క్లస్టర్లుగా విభజించారు. కాగా జిల్లాలోని జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 190 రెవెన్యూ గ్రామాలు, 130 క్లస్టర్లు, కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లో 53 రెవెన్యూ గ్రామాలు, 45 క్లస్టర్లు, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లో57 రెవెన్యూ గ్రామాలు 43క్లస్టర్లను విభజించారు. జిల్లాలోని..

(మిగతా 8లో..)

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న 61 మందిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు డీఈవో రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు ఈ నెల 7వ తేదీన ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రధానం ఉంటుందని తెలిపారు. అవార్డు గ్రహీతలు హాజరు కావాలని సూచించారు.

● అవార్డులపై భాషోపాధ్యాయుల అసహనం

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపికలో భాషోపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 61 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించారని, ఇందులో తెలుగులో కేవలం ఒకరిని ఎంపిక చేసి, హిందీలో ఒక్కరికీ అవకాశం ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఆయన వెంట సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కటుకం నరేందర్, చంద సత్యనారాయణ, దండె రాజేందర్, అన్నారం భట్ల సూర్యనారాయణ తదితరులున్నారు.

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పని చేస్తున్న కాశెట్టి శ్రీనివాస్, రాజారం ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న సీహెచ్ శ్వేతారాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. దొంతాపూర్, దొనూర్ జడ్పీహెచ్‌లకు చెందిన గ్రేడ్-2 జీహెచ్‌ఎం కె ప్రభాకర్, ఎస్‌ఏ ఎస్ మాధవి, మగ్గిడి మోడల్ స్కూల్ పీజీటీ వై మహేష్ కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడు అంబటి రవి, గంబీర్‌పూర్ హైస్కూల్ ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ సంజీవ్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

రూ. 2.50 లక్షలు పలికిన గణనాథుడి లడ్డు



వేలం పాటలో లడ్డును దక్కించుకున్న భక్తుడు సందీప్‌రావు

జగిత్యాల/జగిత్యాల క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మనాయక వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ. 2.50 లక్షలకు గణనాథుని లడ్డును కల్లెడ గ్రామానికి చెందిన జోగినిపల్లి వైష్ణవి-సందీప్‌రావు దంపతులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, ప్రధానకార్యదర్శి దన్నపనేని వేణుగోపాల్ రావు, నాయకులు దివాకర్‌రావు, కమలాకర్‌రావు, ఎన్నమనేని కృష్ణారావు, ప్రశాంత్, రవీందర్, మహిళా విభాగం నాయకులు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైశ్య భవన్‌లో అనంతుల శ్రీనాథ్ రూ. 90 వేలకు, అరవింద్ నగర్‌లో పోసు మధుసూదన్-స్వాతి దంపతులు ఐదు వేల రూపాయలకు వేలంలో లడ్డూను దక్కించున్నారు.

ముత్యంపేటలో..

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో లడ్డు వేలం వేశారు. సంత ప్రకాష్‌రెడ్డి లడ్డూను రూ.17516కు వేలం దక్కించుకున్నాడు.

మతిభ్రమించి మాట్లాడుతున్న కవిత

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, పక్కన మాజీ మంత్రి కొప్పుల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మతిభ్రమించిం మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు విమర్శించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ఇటీవల కవిత మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్‌ను, కేటీఆర్‌ను పార్టీ నుంచి బయటకు పంపితే పార్టీని ఎవరు నడుపుతారని, పిచ్చి మాటలు మాట్లాడడం బంద్ చేయాలని హెచ్చరించారు. కవిత వెనుక ఎవరో ఉండి నడిపిస్తున్నారనే విషయం అర్థమవుతోందని అన్నారు. కేసీఆర్ కడుపులో పుట్టడం కవిత అదృష్టమని, ఆమె ఉద్యమ ఆరంభంలో లేరని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నప్పటికీ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కేవలం కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

● కవిత ఆరోపణలను ఖండిస్తున్నాం..

అనంతరం మాజీ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాళేశ్వరం కమీషన్లతోనే 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావు అదనంగా డబ్బులు ఇచ్చారని కవిత ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హరీష్‌రావు నిజమైన ప్రజానాయకుడని, ఉద్యమం తొలి రోజు నుంచే కేసీఆర్ వెంట నడిచారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్‌లు యూరియ విషయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. యూరియాపై నిజాలు తెలుసుకోవడానికి మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ గ్రామాల్లో గల సహకార సంఘాల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, బీఆర్‌ఎస్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, కోటగిరి మోహన్, దేవేందర్ నాయక్, అవారి శివ కేసరి బాబు, మహిపాల్ రెడ్డి, అయిల్నేని ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, నీలి ప్రతాప్, జవ్వాజి ఆదిరెడ్డి, హరీష్, చందా సాయి తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం







జగిత్యాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు, రాయికల్, కోరుట్లలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ముద్దు రామకృష్ణయ్య మెమోరియల్ సేవా సదన్ అధ్యక్షుడు సూరజ్ శివ శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సేవాసదన్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు జనార్దన్, నీలకంఠం, బాపురెడ్డి, సత్తయ్య, అమీర్ లచ్చన్న, ప్రభాకర్, రవి కిషన్, పెద్ది రాజు, ఆనందం, లక్ష్మణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

రాయికల్: దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్మితమవుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 10 మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తప ల్లి రంజిత్, డీసీ బత్తిని భూమయ్య, కోశాధికారి బెక్కం తిరుపతి, ఉపాధ్యాయులు కుంబాల శ్రీనివాస్, రాపర్తి నర్సయ్య, కడకుంట్ల అభయ్‌రాజ్, బెజ్జంకి హరికృష్ణ, ఆడెపు సుజాత, మచ్చ చంద్రకళ, ద్యావనపెల్లి సురేందర్, పుర్రె రమేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో మామిడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అల్లె పరమేశ్వర్ అనే ఉపాధ్యాయులను మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి సత్కరించారు. కార్యక్రమంలో గుండేటి రవీందర్, ముంజ అంజాగౌడ్, తోపారపు నర్సయ్య ఉన్నారు.

మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు బుక్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేల్మల శ్రీనివాసరావు, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు మెట్‌పల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయిని సురేష్ ముఖీమ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి కరుణశ్రీ చేసిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది.

కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులను పూలమాలలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఏలేటి లక్ష్మారెడ్డి, నల్ల గంగాధర్, డాక్టర్ దిలీప్ రావు, గుంటుకు సురేష్‌బాబు, ఆడెపు మధు, పోతని ప్రవీణ్‌కుమార్, అన్నం అనిల్ కుమార్, ఉషాకిరణ్, మంచాల జగన్, కేజీ కృష్ణ, గుంటుక మహేష్, గాజంగి నాగభూషణం, పోతని నవీణ్ కుమార్, కల్లెం గంగారెడ్డి, బెజ్జెంకి శ్రీనివాస్ రావు, గంగుల రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, జేఏసీ పట్టణ కన్వీనర్ తునికి రాఘవులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.





మెట్‌పల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఇబ్రహీంపట్నంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని

పాము కాటుతో బాలిక మృతి

చొప్పదండి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుగట్ట గ్రామంలో పాము కాటుతో బాలిక మృతిచెందింది. గ్రామానికి చెందిన గర్వంద దీప్తిక(12) చొప్పదండిలోని ఒక ప్రైవేట్‌పాఠశాలలో 7వతరగతి చదువు తోంది. శుక్రవారం గ్రామంలో తన తండ్రి నడపుతున్న కిరాణ దుకాణంలో ఉండగా గర్వంద దీప్తికను పాము కుడికాలి మడమపై కాటువేసింది. పక్కనే ఉన్న పెద్దకూతురు దర్శిక చూసి ఎదురింట్లో ఉన్న వారి బాబాయ్ సంతోష్‌కి తెలిపింది. వెంటనే సంతోష్ వచ్చి చూసి తన నగునూరులోని ప్రతిమ హాస్పిటల్‌కు తరలించగా చికిత్సపొందుతూ దీప్తిక మరణించింది. తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


దీప్తిక(ఫైల్)

చెరువులో గల్లంతైన అనిల్ మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిల్లశివారులో చెరువులో గల్లంతైన దబ్బేట అనిల్(30) మృత దేహం లభించింది. గురువారం దబ్బేట రాధ అంత్యక్రియలకు హాజరైన అనిల్ ప్రమాదవ శాత్తు చెరువులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు జాలర్లు గాలించినా ఆచూకీ లభించ లేదు. శుక్రవారం ఉదయం చెరువులో మరో సారి గాలించగా ఆయన మృతదేహం కనిపిం చింది. ఎస్ఐ వెంకటేష్, తహసీల్దార్ జగదీష్‌రావు పర్యవేక్షణలో అనిల్ శవాన్ని చెరువు నుంచి బయటకు తీసి, పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అందించారు. మృతునికిభార్య ఉమతోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


అనిల్(ఫైల్)

కూనారం-పెద్దరాత్‌పల్లికి తారు రోడ్డు మంజూరు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం నుంచి పెద్దరాత్‌పల్లి చెంచుకాలనీ వరకు తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రూ.10కోట్లు మంజూరు చేయించినట్లు మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ తెలిపారు. గతంలో రహదారి నిర్మాణానికి సర్వే జరిగినా నిధులు మంజూరు కాలేదు. ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధికి వందల కోట్ల నిధులు తీసుకువస్తున్న ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ డీలర్ల సమ్మె విజయవంతం

ఎలిగేడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రేషన్ డీలర్ల ఒక రోజు సమ్మె విజయవంతమైందని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సంకనపల్లి రాజయ్య, జిల్లా నాయకులు వేల్పూరి అశోక్ రావు తెలిపారు. రోజు రోజుకి రేషన్‌దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు, ఇంటర్నెట్, హమాలీ చార్జీలు, గుమస్తాల చార్జీలు పెరిగి డీలర్లకు భారంగా మారుతున్నాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5వేలు, కమీషన్ పెంపు హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు దాటినా ఇప్పటివరకు డీలర్ల సమస్యలను పరిష్కరించ లేదన్నారు. ఐదునెలల కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు శంకర్, రమాదేవి, ఐట్ల శ్రీనివాస్, పుల్యాల సరిత, రవీందర్ రెడ్డి, సువర్ణ, రాజమ్మ, తిరుపతి తదితరులు సమ్మెలో పాల్గొన్నారు.

రేపు సంపూర్ణ చంద్ర గ్రహణం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భాద్రపద శుక్ల పౌర్ణమి ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించ నుంది. ఇది దేశమంతటా స్పష్టంగా కనిపిస్తుంది. రాత్రి 10 గంటలకు స్పర్శకాలంతో ప్రారంభమై అర్ధరాత్రి 1-26 గంటలకు పూర్తి కానుంది. పూర్తి గ్రహణ పుణ్య కాలం 3-29 గంటలు కాగా, సంపూర్ణ చంద్ర గ్రహణ బింబ దర్శనకాలం 1-22 గంటలు. మధ్యాహ్నం ఒంటిగంట వరకే భోజనాలు పూర్తి చేసుకోవాలని, ఉదయం పూజల అనంతరం ఆలయాలు మూసివేయాలని, తిరిగి సోమవారం సుప్రభాత సేవ, పూజలకు ముందు ఆలయాలను శుద్ధిచేసి సంప్రోక్షణ జరుపాలని స్థానిక పండితులు చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలు, షుగర్ వంటి రోగగ్రస్తులు, గర్భిణులు మాత్రం ఆదివారం సాయంత్రం 5 గంటల లోపు అల్పాహారం చేయవచ్చని, చేతనైన వారు గ్రహణ పట్టు, విడుపు స్నానాలు ఆచరించాలని పేర్కొంటున్నారు. పౌర్ణమి నాడు పితృ కార్యాలు ఆచరించవచ్చని, గర్భిణులు ఇళ్లలో ఉండి తమ పనులు చేసుకోవచ్చని తెలిపారు.

మోడల్ స్కూల్ వరకు..

బస్సు నడిపించరూ..

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● నిత్యం అర కిలోమీటరు కాలి నడక

కొడిమ్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అభ్యసిస్తారు. వేములవాడ నుంచి వచ్చే రెగ్యులర్ ఆర్టీసీబస్సులో నిత్యం మండలంలోని తిప్పయ్యపల్లి, నల్లగొండ, చెప్యాల, రామకిష్టాపూర్ గ్రామలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు మోడల్‌స్కూల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. మండలంలోని పూడూర్, గౌరాపూర్, అప్పారావుపేట, ఆరెపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 విద్యార్థులు ఆటోలలో మోడల్ స్కూల్‌కు చేరుకుంటారు. మండలంలోని సూరంపేట, దమ్మయ్యపేట, శనివారంపేట, హిమ్మతురావుపేట, రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి, చింతల్లపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు కూడా ప్రైవేటు వాహనాల్లో పాఠశాలకు వస్తుంటారు. ఆటోలలో స్కూల్‌కు రావాలంటే ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి పాఠశాలకు రాలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఉచిత బస్సు నడపక పోవటంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరు విద్యార్థులు రెగ్యులర్ బస్సులలో వచ్చి ఫారెస్టు ఆఫీసు నుంచి వ్యయప్రయాలతో సుమారు అర కిలోమీటరు నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. సాయంత్రం స్కూల్ నుంచి ఫారెస్టు ఆఫీసు వరకు విద్యార్థులు నడిచి వెళ్లి బస్సులో తమ గ్రామాలకు వెళ్తుంటారు. గతంలో మోడల్ స్కూల్ బస్సును వరకు నడిపిన ఆర్టీసీ అధికారులు ఇప్పుడు నడపక పోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. మోడల్ స్కూల్ వరకు ఆర్టీ బస్సు నడిపే విధంగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఫారెస్టు ఆఫీసు వద్ద బస్సు దిగిన విద్యార్థులు


మోడల్ స్కూల్‌కు నడుచుకుంటు వెళుతున్న విద్యార్థులు

మోడల్ స్కూల్ వరకు బస్సు నడపాలి

బోగ రాకేష్, బీజేపీ నాయకుడు



మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సును నడపాలి. మోడల్ స్కూల్‌కు ప్రత్యేకంగా బస్సు కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వస్తున్నారు. ఆటోలలో, ఇతర ప్రైవేటు వాహనాల్లో వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వరకు ఆర్టీసీ బస్సు నడపాలి.

మద్యం బాటిళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌శివారులోని ఓఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా గురు,శుక్రవారాల్లో మద్యం విక్రయాలను నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మకల్ శివారులోని అశ్వత్థామ ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్‌లో గుట్టువప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రూ.10వేల విలువైన 56 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. మద్యం సీజ్ చేసినట్లు, నిందితుడు బెజ్జంకి శివశంకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలో పోలీసులు బెల్ట్‌షాప్‌పై దాడి నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. శుక్రవారం రాత్రి ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి బెల్ట్‌షాప్ నిర్వాహకుడు చర్లపల్లి అమరేందర్‌పై కేసు నమోదుచేసి రూ.7700 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని గద్దపాక వాగు నుంచి ఇసుకరవాణా చేస్తుండగా కాచాపూర్ గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. అక్రమంగా తరలిస్తుండడంతో ఇసుకట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

హుజూరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌పట్టణంలోని ఏరియాఆస్పత్రి ఎదుట శుక్రవారం పెండింగ్‌లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరునెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పెడితే చర్యలు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో నిరాధారమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఇనుగాల రాములు అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీసర్పంచ్ మాదాసు సతీష్‌లు తనభూమిని ఇతరులకు మార్పిడి చేశారని ఫ్లకార్డుతో నిరసన వ్యక్తంచేశాడు. ఈవిషయమై మాజీ సర్పంచ్ ఫిర్యాదుచేయగా విచారణ జరిపిన రాములును ఎస్ఐ తహసీల్దార్ జగదీశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

వినాయక నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

● నలుగురిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకల్లో చోటు చేసుకున్న ఘర్షణలో అదే గ్రామానికి చెందిన గోగుల రామకృష్ణ, విజయ్, కొమిరె అరవింద్, సుభాష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న వేడుకల్లో యువకులు గొడవకు దిగారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు

గంగాధర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రెండు సాధారణ ప్రసవాలు జరిపినట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు. టీ రవళి, జమున ప్రసవానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యాధికారి ఇద్దరికి సాధారణ ప్రసవాలు జరపగా రవళికి కూతురు, జమునకు బాబు జన్మించారు. తల్లీ,బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

ఇందిరానగర్‌లో పరస్పర దాడులు

● వినాయక మండపానికి కారు ఢీకొనడంతో తలెత్తిన వివాదం
● పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపానికి కారు ఢీకొనడంతో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తంగళ్లపల్లి మండలం ఇందిరనగర్‌లో వినాయక మండపానికి కరుణాకర్ అనే వ్యక్తి కారు ఢీకొనడంతో వివాదం తలెత్తింది. ఇందిరనగర్‌కు చెందిన శ్యాం అనేవ్యక్తి జోక్యం చేసుకుని మందలించడంతో తాత్కాలికంగా గొడవ సద్దుమణిగింది. అర్ధరాత్రి కరుణాకర్ మరో ఇద్దరు వ్యక్తులతో అక్కడికి చేరుకొని గొడవ పడడంతో ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పంపించివేశారు. శుక్రవారం తెల్లవారు జామున మరోమారు సుమారు 20 మంది ఇందిరనగర్‌కు చేరుకొని శ్యాం ఇంటిపై దాడికి దిగారు. శ్యాం ఇంట్లో లేక పోవడంతో అదే వీధిలో ఉన్న మరోవ్యక్తిపై దాడికి దిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై శ్యాం భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కరుణాకర్, సూర హరీష్, మంగల నర్సింహ, మంగళ ప్రసాద్, దండుగుల రామకృష్ణ, గుంజె రంగయ్య, జలపతి చింటు, జలపతి కుమార్‌లతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. అలాగే శ్యాం తనపై సీసాతో దాడిచేసి చంపుతామని బెదిరించాడని పోతుగంటి కరుణకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శ్యాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సంఘటనపై విచారిస్తున్న ఎస్సై ఉపేంద్రచారి

ఆర్ఎంపీ ఇంటి ఎదుట బాధితుల ఆందోళన

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వైద్యంతోనే ఆంజనేయులు మృతి చెందాడని బంధువులు, కుటుంబ సభ్యులు శుక్రవారం వైద్యుడి ఇంటి ఎదుట బైఠాయించారు. మండలంలోని చీకురాయి గ్రామానికి చెందిన మొండెద్దుల ఆంజనేయులు జ్వరం రావడంతో గతనెల 25న ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. అతడు ఇంజక్షన్ వికటించి మృతిచెందాడని బంధవులు ఆరోపిస్తున్నారు. పదిరోజుల అనంతరం మృతుడి కుటుంబసభ్యులు ఆర్ఎంపీ ఇంటిఎదుట ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ పోలీసులు చేరుకొని విచారణ చేపడుతున్నారు.


ఆర్ఎంపీ వైద్యుడి ఇంటి ఎదుట బైఠాయించిన బాధితులు

సైబర్ క్రైమ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

రామడుగు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'సరైన అవగాహనతోనే సైబర్ క్రైమ్స్ నివారణ' అనే పోస్టర్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామానికి చెందిన సైబర్ సత్యాగ్రహ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ యువజన అవార్డుగ్రహీత గజ్జె అశోక్ రూపొందించిన పోస్టర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లాకార్యదర్శి వేముండ్ల కుమార్, జేరిపోతుల పోచయ్య, జేరిపోతుల నర్సయ్య, జేరిపోతుల మహేష్, గజ్జెల నవీన్ కుమార్, అజయ్ జేరిపోతులు, వెంకటేశ్ జేరిపోతుల, సతీష్ జేరిపోతుల, చందు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

హుజూరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని పోచమ్మవాడలో ఓవ్యక్తిపై శుక్రవారం కోతులు దాడిచేసి గాయపరిచాయి. తాళ్లపల్లి సారయ్య అనేవ్యక్తి ఇంటి ఎదుట నిలుచోని ఉండగా, ఒకేసారిగా కోతులు దాడిచేసి కరిచాయి. దీంతో సారయ్యకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతన్ని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హుజూరాబాద్ పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ ఎక్కువ అవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడు తున్నారు. మున్సిపల్ అధికారులు కోతులను పట్టి దూరంగా వదిలిపెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


కోతుల దాడిలో గాయపడిన సారయ్య

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు తీగలగుట్టపల్లి నుంచి వల్లంపహాడ్‌కు వెళ్లే దారిలో మూల మలుపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. హెచ్చరికబోర్డులు, కంచెను ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.


మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మత్తు మందు చల్లి చోరీకి యత్నం

● ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్తు మందు చల్లి చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టుచేశారు. ఘటన వివరాలను రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. పెద్దపల్లిజిల్లా ఓదెల మండలం నాంసానిపల్లికి చెందిన నగావత్‌సరోజ అనా రోగ్యంతో గురువారం సాయంత్రం కరీంనగర్ శివారులోని చల్మెడ ఆస్పత్రికి చికిత్సకోసం వచ్చింది. మూత్రశాల ఎక్కడని అక్కడే పక్కన బురఖాలో ఉన్న ఇద్దరిని అడిగింది. దారి చూపించిన ఆ ఇద్దరు వెంటే వెళ్లారు. సరోజ ముఖంపై మత్తు మందు స్ప్రే చేశారు. ఆమె కిందపడిపోగానే మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే సరోజ మేలుకొని పెద్దగా అరవడంతో అక్కడినుంచి పరార య్యారు. దీనిపై బాధితురాలు కరీంనగర్‌రూరల్ పోలీసుల కు ఫిర్యాదు చేసింది. నిందితుల కోసం గాలిస్తుండగా శుక్రవారం ఉదయం బొమ్మకల్ శివారులోని కోకోకోలా దాబాసమీపంలో బురఖా ధరించిన ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగు తున్నట్లు స్థానికులద్వారా సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకొని వారినిఅరెస్టు చేశారు. వారిలో ఒకమగ వ్యక్తి బురఖా ధరించి ఉండడంతో పోలీసులు ఖంగు తిన్నారు. ఇద్దరిని విచారించగా సిరిసిల్లకు చెందిన ఎండీ మీరాజున్నీసా(39), చిప్ప సాయినాథ్(24) గా వెల్లడైంది. వారినుంచి మత్తుమందు స్ప్రే, 2సెల్‌ఫోన్‌లు, 3,800 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. గంటల వ్యవధిలో నిందితులను పట్టుకున్న సీఐ నిరం జన్‌రెడ్డి, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు. చల్మెడ ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించి నట్లు సమాచారం.

● టీవీలో క్రైం పోర్టల్ సీరియల్ చూసి...

టీవీలో ఓక్రైంపోర్టల్ సీరియల్‌లో మహిళపై మత్తు మందు స్ప్రేచేసి స్పృహ కోల్పోగానే ఆమె ఒంటిపై బంగారం చోరీ చేసిన ఘటనను చూసి ఆదే మాదిరిగా ప్రయత్నించినట్లు నిందితురాలు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సీఐ తెలిపారు. గతంలో ఇదే ఆసుపత్రిలో ఒకసారి ప్రయత్నించగా సాధ్యంకాలేదని, రెండోసారి చేసి పోలీసులకు పట్టుబడిందని పేర్కొన్నారు. మత్తుమందుతో స్ప్రేచేసి దొంగతనాలు సులువుగా చేయవచ్చని భావించిన నిందితురాలు తన ఇంటి పక్కనే ఉంటున్న సాయినాథ్‌తో చోరీకి పథకం రచించినట్లు తెలిపారు.


నిందితులను అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

రైతుపై కేసు నమోదు

● రాణాకు తరలివెళ్లిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రైతు మానుక లక్ష్మణ్‌పై స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు శుక్రవారం తెలిపారు. వారి కథనం మేరకు.. ఈనెల 4న యూరియా కోసం స్థానిక ప్యాక్స్ ఆధ్వర్యంలోని గోదాం వద్దకు రైతు లక్ష్మణ్ వెళ్లాడు. అక్కడ భారీసంఖ్యలో రైతులు బారులు తీరారు. దాంతో సహనం కోల్పోయిన రైతు లక్ష్మణ్ సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అదేరోజు రాత్రి కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిమిత్తం శుక్రవారం రైతు లక్ష్మణ్ ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆయనకు మద్దతుగా రాణాకు తరలివెళ్లారు. అధికసంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. యూరియా సరఫరా కావడం లేదని ఆవేశంలో మాట్లాడితే రైతుపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. రైతుపై కేసు నమోదు చేయడం సరికాదని వాపోయారు. ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తారా..? అని వాగ్వాదానికి దిగారు. పోలీసులు సర్దిచెప్పడంతో రైతులు, బీఆర్ఎస్ నాయకులు వెనుదిరిగారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి విలేకరుతో మాట్లాడారు. సకాలంలో యూరియా అందక రైతు లక్ష్మణ్ తన ఆవేదనను వెళ్లబోసుకుంటే కేసు నమోదుచేయడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేస్తోందని మండి పడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు పర్శరాములు, నర్సింహారెడ్డి, రాజం, రమేశ్, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హన్‌మాన్ నగర్‌లోని వినాయక మండపం వద్ద యూత్ సభ్యుల మధ్య జరిగిన చిన్న గొడవలో మనస్తాపానికి గురైన కాలనీకి చెందిన కైరికొండ మనోజ్ (15) అనే బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రోజున నిమజ్జన ఉత్సవానికి సంబంధించి డబ్బులు విషయంలో మనస్పర్థలు రాగా బాలుడు నింద భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

రైతుల చేతిలో కొండచిలువ హతం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో వ్యవసాయ పొలాల మధ్య కనిపించిన కొండచిలువను గ్రామస్థులు కొట్టిచంపారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. దర్శనం కొమురయ్య అనే రైతు శుక్రవారం తన వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. వరిచేనులో బాగా కదిలిక అనిపించడంతో చూడగా కొండచిలువ కనిపించింది. దీనితో తోటి రైతులకు చెప్పడంతో వారంతా ఏకమై కొండచిలువను కొట్టిచంపారు. గ్రామంలోని వ్యవసాయ బావుల వద్దకు ఇటీవల కొండచిలువలు తరచూ వస్తున్నాయని రైతులు పేర్కొన్నారు.


చనిపోయిన కొండచిలువ

పెద్దాపూర్ గ్రామైక్య సంఘం మహిళకు అరుదైన గుర్తింపు

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విజయ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విజయ

జూలపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి నర్సింహస్వామి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు దొమ్మటి విజయ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసపత్రాన్ని అందుకొన్నారు. సంఘం అభివృద్ధికి చేస్తున్న విశేష కృషిని గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం విజయను అభినందిస్తూ ప్రశంసపత్రాన్ని అందజేశారు. మహిళా సంఘాల ప్రదినిధులు, మహిళలు, అధికారులు ఏపీఎం సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

విఘ్నేశ్వరుడికి మహానైవేద్యం

సిరిసిల్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడికి మహానైవేద్యాల (బోగాలు)ను సమర్పించారు. శుక్రవారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యాకపరమేశ్వరీ ఆలయం, పెద్దబజార్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి దాదాపు 300పైగా రకాలతో నైవేద్యాలను సమర్పించారు. మహిళలు కూరగాయలు, స్వీట్లతో తయారుచేసిన వినాయక ఆకృతులు ఆకర్షించాయి.



వినాయకుడికి సమర్పించిన మహానైవేద్యం

బాల సాహితీవేత్త 'కందేపి'కి పురస్కారం



రాణి ప్రసాద్ పురస్కారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్

సిరిసిల్ల సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌ను ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో కృష్ణా జిల్లా రచయితల సంఘం, మండలి వెంకటకృష్ణారావు శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ రాణిప్రసాద్ సాహిత్యంతో పాటు విద్యారంగంలో చేస్తున్న విశేష కృషికి పురస్కారాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రసాద్, నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ వీఎస్‌రావులు అందించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

కొండగట్టులో కేరళ ఐఎఫ్ఎస్ అధికారి

మల్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర ఐఎఫ్ఎస్ అధికారి వేలూరి నరేంద్రనాథ్ శుక్రవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలుకగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు అంజనేయస్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. తెలంగాణ సీఎంఓ సెక్యూరిటీ వింగ్ అధికారి వాసుదేవరెడ్డి శుక్రవారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



ఆలయంలో కుటుంబ సభ్యులతో ఐఎఫ్ఎస్ అధికారి

నిలకడగా ఎల్‌ఎండీ నీటిమట్టం

దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034టీఎంసీలు కాగా శుక్రవారం రాత్రి 22.707 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 3వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 305 క్యూసెక్కులు మొత్తం 3305క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. అదేవిధంగా ఎగువ కాకతీయకాలువ ద్వారా నుంచి 1400 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 1000 క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 905క్యూసెక్కులు మొత్తం 3305 క్యూసెక్కులు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు శుక్రవారం తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 70,188 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా తొమ్మిది గేట్లు ఎత్తి 24,950 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 76.104 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నాలుగు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.93టీఎంసీలకు నీరు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 12800 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు శుక్రవారం 14 600 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14000 క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 600 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఉన్న ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు ఒక గేట్ ద్వారా వెయ్యి క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.48 ఉంది. నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.221 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

పారిశుధ్య కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో నిమజ్జన ఏర్పాట్లలో ఉన్న మురారి అనే పారిశుధ్య కార్మికుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మురారి స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

నేడు అనంత పద్మనాభస్వామి వ్రతం



శ్రీభూనీల సమేత రంగనాయక స్వామి ఆలయం

ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ అధికారులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభ స్వామి వ్రతానికి భక్తులు సన్నద్ధమవుతున్నారు. యేటా బాద్రపద శుక్ల చతుర్థశి రోజు జరుపుకునే వ్రతం అనంత చతుర్థశి వ్రతం, అనంత పద్మనాభ వ్రతంగా పిలుస్తారు. ఈ వ్రతాన్ని శనివారం జరుపుకోనున్నారు. మానవులు తనను అనంత సంసార సంద్రంలో నుంచి ఉద్ధరించమని అనంత పద్మనాభుడిని వేడుకుంటారు. అలా వేడుకొంటూ చేసే వ్రతమే అనంత పద్మనాభస్వామి వ్రతం. అనంతుడు అంటే ఆదిశేషుడు. విష్ణువునకు అనంత శయనుడు అని పేరు. కాలానికి, ఆదిశేషుడికి, విష్ణువునకు అవినాభావ సంబంధాన్ని తెలిపే ఈ వ్రతం ఎందరికో ఆరాధ్యంగా మారింది.

నీరుకుల్లలో ప్రత్యేక పూజలు

నీరుకుల్లలోని భూ నీలసమేత రంగనాయక స్వామి ఆలయంలో శనివారం పద్మనాభస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ వ్రతాలకు దేవాదాయ శాఖతోపాటు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా నీరుకుల్లలోని మానేటి రంగనాయక స్వామి ఆలయంలో అనంత పద్మనాభ వ్రతాలు జరుపుకుంటున్నారు. ఇక్కడ వ్రతాలు జరుపుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఇక్కడికి వస్తారు. రంగనాయక స్వామి వారు శయనించిన విగ్రరూపకంగా ఉంటే, కేరళలోని అనంత పద్మనాభ స్వామి వారిని పోలిన విధంగా స్వామి ఇక్కడ భక్తులకు దర్శనం ఇస్తారు. మానేటి నది ఒడ్డున స్వయంభూగా వెలసి మానేటి రంగనాథుడిగా ప్రసిద్ధి చెంది పూజలందుకుంటున్నాడు. శనివారం చతుర్థశి ఉదయం 6.30 నుంచి అనంత పద్మనాభ వ్రతం, కోటి వత్తుల నోము నిర్వహిస్తున్నారు. భక్తులకు అల్పాహారం, అన్న దానం ఏర్పాటు చేస్తున్నారు. వ్రతాలు అనంతరం భక్తులు పెద్ద మట్టి పాత్రతో కూడిన ప్రమిదలో కోటి వత్తులు వేసి నెయ్యితో వెలిగిస్తారు. వ్రతం సందర్భంగా స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించడం, ధానధర్మాలు చేస్తారు. భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో శంకర్ తెలిపారు.

రాళ్లవాగు కుడికాలువ గండి పూడ్చివేత



గండికి మరమ్మతు చేస్తున్న రైతులు

కథలాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులో ఉన్న రాళ్ళవాగు కుడికాలువకు ఇటీవల వర్షాలకు గండి పడి నీరంతా వృథాగా పోతున్న నేపథ్యంలో రైతులు మరమ్మతులు చేపట్టారు. గతంలో ఇప్పటికే ఈ ప్రాంతంలో నాలుగుసార్లు గండిపడి ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీరు వాగులోకి పడి పోతోంది. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ క్రమంలో గండిని పూడ్చుకునేందుకు రైతులు ముందుకు వచ్చారు. శుక్రవారం విరాళాలు పోగు చేసుకుని ట్రాక్టర్లతో మట్టి పోసుకుని గండిని పూడ్చి వేశారు. తరచూ గండిపడి ఇబ్బందికరంగా మారుతున్నందున రాయితో తెట్టె ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గండిపడ్డ ప్రదేశాన్ని కమ్మర్ పల్లి ఇరిగేషన్ డీఈఈ, ఏఈలు పరిశీలించగా ప్రకృతి వైపరీత్యాలు, వరదల నష్టం కింద కొంత నిధులు కేటాయించాలని రైతులు కోరారు.

గులాం చెరువు బుంగ..

గంభీరావుపేట: మండలంలోని ముస్తాఫనగర్ పరిధిలోని గులాం చెరువు బుంగను శుక్రవారం పూడ్చివేశారు. తూం బాగంలో బుంగ పడి నీరు వృథాగా పోతోంది. ఈ విషయమై రైతులు ఇరిగేషన్ అధికారులకు చెప్పడంతో ఎమర్జెన్సీ మరమ్మతులకు నిధులు లేవని చెప్పడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు శివంది దేవందర్ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జేసీబీని పంపించగా బుంగను పూడ్చి వేశారు. రైతులు రాజం, దేవయ్య, నాగరాజు, స్వామి, తిరుపతి, రాజలింగం, నాయకులు విష్ణు ఉన్నారు.

పింఛన్‌లు పెంచేంత వరకు ఉద్యమిస్తాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ



గంగాధరలో మాట్లాడుతున్న మంద క్రిష్ణ మాదిగ

మానకొండూర్/గంగాధర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు, చేయూత పెన్షన్‌దారులకు కొత్త పింఛన్‌లు పెంచేంత వరకు రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మానకొండూర్, గంగాధరలో నియోజకవర్గ పింఛన్‌దారులతో శుక్రవారం మహాగర్జన సన్నాహక సదస్సు జరిగింది. ఈ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని పింఛన్‌దారులందరికి పింఛన్‌లు పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చాడని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై 21నెలలు దాటినా పింఛన్‌లను పెంచక పెన్షన్‌దారులను సీఎం మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలోని మండలాలు, జిల్లాలు, అన్ని రోడ్లపై పైకి వికలాంగులు, చేయూత పెన్షన్‌దారులకు పెంచేంత వరకు ధర్నాలు, దిగ్బంధాలు, రాస్తారోకోలు చేసి పింఛన్ సాధించుకుందామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపల్లి పౌల్, ఎనగందుల శ్రీనివాస్, మల్లేశం, రాజయ్య, సుదర్శన్, గంగాధరలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, చిలుముల రాజయ్య, వికలాంగులు, చేయూత పింఛన్‌దారులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు అవార్డుల ప్రదానం







అవార్డు అందుకుంటున్న డాక్టర్ కోడూరి శ్రీవాణి, డాక్టర్ కాంపల్లి అర్జున్, భరత్‌రెడ్డి

గణేశ్‌నగర్/ఎలిగేడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన జిల్లా వాసులు అవార్డులు అందుకున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభా గపు అధిపతి డాక్టర్ కోడూరి శ్రీవాణికి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక శిల్పారామంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, ఎమ్మెల్సీ పి. శ్రీపాల్‌రెడ్డి, ఎస్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫె సర్ ఉమేష్ కుమార్ అవార్డు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, వీసీ ఓఎస్‌డీ డాక్టర్ హరికాంత్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకున్న కాంపల్లి అర్జున్

కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో వాణిజ్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వ ర్తిస్తున్న డాక్టర్ కాంపల్లి అర్జున్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, అకడమిక్స్ గైడెన్స్ ఆఫీసర్ బాల భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యుడు బ్రిజేష్ అభినందనలు తెలిపారు.

భరత్‌రెడ్డికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ప్రదానం

మంథని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకొని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గీట్ల భరత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన చేతుల మీదుగా శుక్ర వారం అందుకున్నారు. శిల్పా కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. భరత్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సాయుధ పోరాట ఉత్సవాలు విజయవంతం చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కోరుట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సాయుధ పోరాట ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో జిల్లా కార్యదర్శి ములుగురి హన్మంత్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా సమవేశానికి చాడ వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ నెల 11 నుంచి 17 వరకు సాయుధ పోరాట ఉత్సవాలను నిర్వహించాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామ గ్రామాన సీపీఐ జెండాలను ఎగరవేయాలని సూచించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది అమరుల య్యారని గుర్తు చేశారు. అంతకు ముందు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎరుగు రాల భూమేశ్వర్, వెన్న సురేష్, ఎర్రదండి భూమయ్య, మహ్మద్ మౌలనా, ఎండీ ముక్రం, మహ్మద్ ఉస్మాన్, కొక్కుల శాంత, అన్నం రాధా, మాడిశెట్టి కిరణ్, కొండ రాజయ్య, సనిగారపు ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జగ్గనిఒర్రె



ప్రమాదకరంగా మారిన జగ్గనిఒర్రె

- వర్షాలకు కూలుతున్న రక్షణగోడ
- ఆందోళనలో స్థానికులు

మల్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మల్యాలోని జగ్గనిఒర్రె ప్రమాదకరంగా మారింది. వర్షాలకు ఒర్రె రక్షణ గోడ కూలుతుండడంతో స్థానిక లు ఆందోళన చెందుతున్నారు. ఒర్రెగడ్డ ప్రాంతం నుంచి హనుమాన్ ఆలయం వరకు శిథిలమైంది. దీంతో భారీ వర్షాలకు ఒర్రె మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే ఈ కాలువ అఅభివృద్ధి చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉండగా కొన్నాళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పాలకులు పేర్కొన్నప్పటికీ దాని ఊసే లేకుండా పోయింది. ఈ కాలువలోనే మురుగునీరు కలుస్తుండడంతో దుర్వాసన, దోమల మధ్య స్థానికులు సహవాసం చేస్తున్నారు. తాజాగా గోడకూలి ప్రమాదకరంగా మార డంతో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఇటీవల వర్షాలకు కూలిన ఒర్రె రక్షణ గోడ

మరమ్మతులు చేస్తాం: శ్రీకాంత్, పంచాయతీ ఈవో, మల్యాల

జగ్గనిఒర్రెకు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. సీసీతో రక్షణగోడకు ఇంజనీరింగ్ అధికారులతో ప్రణాళిక చేయిస్తాం. కాలువలో అపరిశుభ్రత తొలగింపు చేపడుతాం. త్వరలోనే జగ్గనిఒర్రె రక్షణగోడ పనులు చేపడుతాం.

రేపు మల్లికార్జున స్వామి ఆలయం మూసివేత

ఓదెల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని 7న, ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేస్తున్నట్టు కార్య నిర్వహణ అధికారి సదయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ఎలాంటి పూజలు ఉండవని, తిరిగి 8న, సోమవారం ఆలయంలో సంప్రోక్షణ అనంతరం ఉదయం 9 గంటలకు పునఃదర్శనం ఉంటుందని తెలిపారు.

వినాయకా... సెలవిక..

- ఘనంగా గణనాథుడి నిమజ్జనం
- నృత్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ వీడ్కోలు పలికిన భక్తులు
- ఉత్సాహంగా సాగిన శోభాయాత్ర





మల్యాలలో నృత్యం చేస్తున్న యువతులు, పెంబట్లలో వినాయక నిమజ్జ వేడుకల్లో భక్తులు, జగిత్యాలలో కోలాటం ఆడుతున్న మహిళలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన జగిత్యాలలో గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ముందు జాగ్రత్తగా చెరువులోకి వెళ్లకుండా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. జగిత్యాల టవర్ వద్ద విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివచ్చే వినాయకుడి వద్ద టెంకాయ కొట్టడంతో పాటు మెమోంటోను అందజేశారు. పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు నిమజ్జన వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సౌకర్యార్థం ఉచితంగా మంచినీటి వసతి కల్పించారు. ఐదు భారీ క్రేన్‌లతో పాటు గణనాథులను చెరువులోకి తరలించేందుకు 12 తెప్పెలను ఏర్పాటు చేశారు. చెరువు వద్ద మున్సిపల్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు నిమజ్జన వేడుకలను పర్యవేక్షించారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు..

వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా పట్టణంలోని వివిధ వినాయక మండపాలతో పాటు చింతకుంట చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ స్పందన అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన వేడుకలను ప్రారంభించారు. స్వయంగా నాటు తెప్పపై చెరువులోకి వెళ్లి వినాయకులను నిమజ్జనం చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు టవర్ వద్ద శోభాయాత్రగా వస్తున్న వినాయకులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో ఎస్పీ అశో క్ కుమార్ పర్యటించారు. నిమజ్జనం నిర్వహించే చింతకుంట చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు.

మల్యాల/పెగడపల్లి/రాయికల్/వెల్గటూర్: మల్యాల, పెగడపల్లి, రాయికల్ మండలాల్లో గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మేళాతాలాలు, యువతి, యువకుల నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి ఎస్సారెస్పీ కెనాల్, వరదకాలువ, కుంటలు, చెరువులో నిమజ్జనం చేశారు. రాయికల్, వెల్గటూర్ ఎస్సైలు సుధీర్‌రావు, ఉమాసాగర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని రాయపట్నం, పెద్దనక్కలపేట తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. పెద్ద వినాయక విగ్రహాలను రాయపట్నం గోదావరి నదిలో క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవీంద్రకుమార్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు..

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, పోతారం, బట్టపెల్లి, సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మాజీ సర్పంచ్ బొడ్డుపెల్లి రాజన్న, సహకార సంఘం అధ్యక్షుడు గుర్నాథం మల్లారెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మెంబర్ బొడ్డుపెల్లి శంకర్, నోముల గోపాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఎట్టెం శ్రీనివాస్, అరై ప్రేమనందం తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో పవర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వేదురు కర్రతో తయారు చేసిన గణపతికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట గ్రామాల్లో యూత్, కుల సంఘాల సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ శివారులోని వాగులో నిమజ్జనం చేశారు.

ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్లు

జిల్లా కేంద్రంలో జరిగిన నిమజ్జనోత్సవంలో 11 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. హైదరాబాద్ తర్వాత జగిత్యాల జిల్లాలోనే విధులు నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన బందోబస్తులో ట్రాన్స్‌జెండర్లను భాగస్వామ్యం కల్పించడం అభినందనీయమన్నారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

జగిత్యాల క్రైం: గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాసవీ గార్డెన్‌లో శుక్రవారం పోలీస్ అధికారులతో భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 570 మంది పోలీస్ అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత నిమజ్జనానికి ప్రజలు సహకరించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలు చెరువులు, కుంటల వద్దకు ఎక్కువగా రానున్న దృష్ట్యా భద్రత చర్యలు తీసుకుని వారితో మర్యాదగా ప్రవర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు రఘచందర్, రాములు తదితరులు ఉన్నారు.



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్





జగిత్యాలలో పూజలో పాల్గొన్న చిన్నారులు, చిన్నమెట్‌పల్లి గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యూత్ సభ్యులు, ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లతో ఎస్పీ అశోక్‌కుమార్, అధికారులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనక్కలపేటలో ఇటీవల మృతి చెందిన గూడూరి శంకరయ్య, బాదినేని అమృతవ్వ కుటుంబసభ్యులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు.. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, నాయకులు బాదినేని సత్యనారాయణ, నల్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్ అన్నారు. శుక్రవారం గణపతి నిమజ్జనోత్సవ రూట్ మ్యాపును పరిశీలించారు. నిమజ్జనోత్సవ కార్యక్రమాల విధులు నిర్వహిస్తున్న సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి ఏడీఈలు రఘుపతి, అమరేందర్, ఏఈలు శ్రీనివాస్, శ్యాంరావు, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

రాయికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని మూడో వార్డులో గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మూడు లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీని పట్టణ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు విన్నవించగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆలయ అధ్యక్షుడు రాజలింగం, ప్రధాన కార్యదర్శి బన్న సంజు, భూమేష్, రాము, మధు, గణేష్, మాధవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు

కోరుట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం ఓనం వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చన, అభిషేక కార్యక్రమాలను జరిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కథలాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేటలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 85 మందికి కంటి పరీక్షలు చేయగా 46 మందికి మోతె బిందు ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆపరేషన్ల నిమిత్తం కరీంనగర్ రేకుర్తి ఆసుపత్రికి బస్సులో తరలించారు. మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి జవిడి ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, సభ్యులు నాగం భూమయ్య, ప్రతాప్‌రెడ్డి, అల్లె పరమేశ్వర్, మామిడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పురుకుటపు సంతోష్‌రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

కోరుట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనవారం జరిగే గణపతి నిమజ్జనోత్సవానికి మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదనాం నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నారు. శోభాయ్రాత పట్టణంలోని ఐబీ రోడ్డు నుంచి నందీ చౌరస్తా, కార్గిల్ చౌరస్తా గాంధీ రోడు, జవహార్ రోడ్డు, కాల్వగడ్డ, అంబేడ్కర్ నగర్ వరకు నిర్వహించి అక్కడ వాగులో నిమజ్జనం చేయడానికి ఏరాట్లను చేస్తున్నారు. నిమజ్జనం ఘాట్ వద్ద బారీ క్రేన్‌లతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీంతిదర్ తన సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఎ రాములు నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలను సీఐ సురేష్ బాబు, ఎస్‌ఐ చిరంజీవికి వివరించారు.

మెట్‌పల్లి టౌన్: వినాయక నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ టి మోహన్ పరిశీలించారు. స్థానిక వట్టి వాగులో పూడిక తీయటాన్ని సీఐ అనిల్, ఎస్సై కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, ఏఈ దీపక్, విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్, ఏడీ జక్కుల అమరేందర్, ముజీబ్ రాజశేఖర్, అనిల్ ,నిజాం,సృజన్ మనోజ్, మహేందర్ పాల్గొన్నారు.



కోరుట్లలో ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కార్యకర్తలు అధైర్యపడవద్దు: కొప్పుల



బుగ్గారం మాజీ సర్పంచ్‌కి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొప్పుల ఈశ్వర్

బుగ్గారం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని ఏ ఒక్క కార్యకర్త అధైర్య పడవద్దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుగ్గారం మండల కేంద్రంలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన స్వల్ప కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూట కట్టుకున్నదని అన్నారు. ప్రస్తుతం రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడమే కాకుండా అభివృద్ధి పనులు కూడా కుంటుపడ్డాయని విమర్శించారు. బుగ్గారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మాసర్తి రాజిరెడ్డి, సిరికొండ మాజీ ఎంపీటీసీ నోముల శ్రీలత చుక్కారెడ్డి తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గాలిపల్లి మహేష్, యూత్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, మాజీ మండల అధ్యక్షుడు సీర్నేని మల్లేశం, మాజీ సర్పంచ్ మూల సుమలత, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, నాయకులు దాసర్థి పూర్ణచందర్, బల్గూరి వంశీధర్ రావు, దాసరి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం





జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురిలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లోని వస్తువులపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకున్నందుకు గానూ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, పట్టణ బాధ్యులు ఆముదరాజు, సిరికోండ రాజన్న, గాదాసు రాజేందర్, ఠాకూర్ పవన్‌సింగ్, ఇట్యాల రాము, గడ్డల లక్ష్మీ, గంగారెడ్డి, సాగర్, రాగిల్ల సత్యనారాయణ, దివాకర్, జ్ఞానేశ్వర్, కాయితి శంకర్, కడార్ల లావణ్య, కళావతి తదితరులున్నారు.

ధర్మపురి: మండలం లోని కమలాపూర్, ధర్మపురి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఒటేటి అంజయ్య, ప్రధాన కార్యదర్శులు కామెర ప్రభాకర్, జెల్ల వినోద్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, జిల్లా నాయకులు బెజ్జారపు లవణ్, మండలోజు సూరజ్, ఆరందాసు నవీన్, పాత నాగరాజు, కలకోట రాజు, కాశెట్టి హరీష్ పాల్గొన్నారు.

రాయికల్: మండలంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు కురుమ మల్లారెడ్డి, ఆకుల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తొగిటి లక్ష్మీనారాయణ, కురుమ నారాయణరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి భూమేష్, సంజీవ్, ఉపాధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, ఉడుత రవీందర్, సంకోజి మహేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి నాయక్, అల్లె నర్సయ్య, మల్లేష్ యాదవ్, సతీష్, రాము, గంగరాజం, గంగాధర్ నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మల్లేశం, వేణు, రాచర్ల రమేశ్, రమేశ్, జనగాం రాములు, సంకీర్త్, గోవర్ధన్‌రెడ్డి, గంగారాం, కిషన్ పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలోని ముక్కట్రావ్‌పేటలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్, ప్రధాన కార్యదర్శి దుబ్బాక సాగర్, దుంపెట కిరణ్, ఎడ్ల తిరుపతి, పత్తిపాక సత్తయ్య, కరిడె చక్రపాణి, రాజు, రమేష్, రాజన్న, చంద్రమౌళి, పవన్, సాయి, వంశీ, మధుకర్, హరీష్, వేణు గోపాల్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మీ, నాయకులు బండి స్వామి, శివరాత్రి వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, రమణచారి, హరీష్, రాజుకుమార్, బీమన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, నాయకులు భోగ గంగాధర్, కొట్టాల శ్రీనివాస్, పూసాల సంపత్, ఏసాల ప్రశాంత్, పూసల శ్రీనివాస్, బుద్ది లింగం, పుప్పాల రాజేందర్, గొర్రె జ్యోతి, నేరెళ్ల జలపతి, ఏనుగు శోభన్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు బొడ్ల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, రాష్ట్ర స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్‌రెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివం, నాయకులు ఇల్లెందుల శ్రీనివాస్, కొల్లెపు శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేట విజయ్, కుడుకల రఘు పన్నాల రాఘవరెడ్డి, డాక్టర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ'కు కొత్త కళ

(5వ పేజీ తరువాయి)

పంచాయతీల్లో 230 మంది జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. గతంలో వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పనిచేసి, ఇతరశాఖల్లో విలీనమైన వారికి ప్రభుత్వం రెండుసార్లు తిరిగి రెవెన్యూ శాఖలో చేరే అవకాశం కల్పించగా, 120 మంది అర్హత సాధించారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన ఈ అధికారులకు ఒక్కో క్లస్టర్‌లో రెండు నుంచి మూడు రెవెన్యూ గ్రామాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. మిగిలిన 45 ఖాళీలకు త్వరలో ఇన్‌చార్జిలను నియమించనున్నారు.

● **నియామక పత్రాల అందజేత...**

జీపీవోలుగా ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. హైద్రాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో నియామకపత్రాలు అందించారు. ఇందుకుగానూ జగిత్యాల జిల్లా నుంచి జీపీవోలను ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి హైద్రాబాద్‌కు తరలించారు. ఒక్కో బస్సుకు ఒక నాయబ్ తహసీల్ధార్, ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. జీపీవోలకు భోజన వసతితో పాటు అన్ని ఏర్పాట్లను కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆధర్యంలో అధికారులు చేశారు. జీపీవోలుగా ఎంపికైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా గ్రామాల్లో బాధ్యతలు చేపట్టేలా అధికారులు కసరత్తులు చేస్తున్నారు. దీంతో రెవెన్యూ వ్యవస్థకు గ్రామస్థాయిలో ఓ అధికారిని నియమించినట్లు అవుతుంది. ఫలితంగా ఆ శాఖకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకే...



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు గ్రామ పంచాయతీల స్థాయిలో వ్యవస్థను మరింత పటిష్ట పరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా వీఆర్ఏ, వీఆర్‌వోలలో అర్హులను ఎంపిక చేసి గ్రామపరిపా లన అధికారులుగా నియామకం చేస్తున్నాము. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేసి బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాము.

పకడ్బందీగా జీపీవోల నియామక ప్రక్రియ



- సత్యప్రసాద్, కలెక్టర్

జిల్లాలో గ్రామపరిపాలన అధికారుల నియామక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాము. ఆసక్తి, అర్హతలు గల వీఆర్ఏ, వీఆర్‌వోలకు పరీక్ష నిర్వహించి జీపీవో పోస్టుకు ఎంపిక చేశాము. జిల్లాలో రెవెన్యూ గ్రామాల్లో కొత్తగా ఎంపికైన అభ్యర్థులుగా గ్రామ పరిపాలన అధికారులుగా నియామకం చేస్తున్నాము. రెండు, మూడు రోజుల్లో గ్రామాల్లో జీపీవోలు బాధ్యతలు స్వీకరిస్తారు.

వినాయక మండపంలో మంత్రి అడ్లూరి పూజలు




రాయపట్నంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ధర్మపురి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామంలో గల వినాయక మండపాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని గణనాథుడిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీలను ఆయన అందించారు. కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాందేని మొగిలి, పాయిలి శరత్‌చంద్ర, గటికె కమలాకర్, అంతర్పుల దేవవరం, గోల్ల రఘు, రాందేని సిద్దేష్, బూరగడ్డ అంజి, అంతర్పుల డేవిడ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురి పట్టణంలోని పలు వినాయక మండపాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడి చిత్రపటాన్ని మండప నిర్వాహకులు అందించారు.

వెల్గటూర్/పెగడపల్లి: వెల్గటూర్, పెగడపల్లి మండలంలోని వివిధ మండపాల వద్ద మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మంత్రికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వెల్గటూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్, నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, మెరుగు మురళి, శ్రీకాంత్ రావు, ఉదయ్, సందీప్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, కూస లక్ష్మణ్, పాల్గొన్నారు రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, కడారి తిరుపతి, సంధి మల్లారెడ్డి, ఆకుల విష్ణు, సురకంటి సత్తిరెడ్డి, బండారి శ్రీనివాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు



ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పులను సన్మానిస్తున్న నిర్వాహకులు

బొజ్జ గణపయ్యకు 108 రకాల నైవేద్యం

వెల్గటూర్, సెప్టెంబరు 05 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మండపాల వద్ద వినాయకుడికి విశేష పూజలు చేస్తున్నారు. వెల్గటూర్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద బొజ్జ గణపయ్యకు భక్తులు 108 రకాల నైవేద్యం సమర్పించారు.

కోరుట్ల: పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

భవానీ సేవా సమితి కార్యవర్గం

రాయికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని భవానీ సేవా సమితి నూతన కార్యవ్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాయిల్ల జనార్దన్, ముఖ్య సలహాదారుడిగా గంగాధరి సురేష్, అధ్యక్షుడిగా శ్రీగద్దె సుమన్, ఉపాధ్యక్షులుగా కోయల్కార్ వినోద్, తొగొటి రవితేజను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మోర శశికాంత్, కోశాధికారిగా గట్టు నవీన్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా దువ్వాక కృష్ణ చైతన్య, శ్రీగద్దె శ్రావణ్ కుమార్, కార్యవర్గసభ్యులుగా పారిపెల్లి శివప్రసాద్, కటుకం శివకుమార్, గట్ల తరుణ్, పవన్, వెంకటేష్, అఖిలేష్‌ను ఎన్నుకున్నారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని, జీఎస్టీని సులభతరం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న మోదీ సర్కార్ ఎల్లవేళలా పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు నలువాల తిరుపతి, వడ్డేపల్లి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కృష్ణహరి, సాంబారి కళావతి, చందు, భూమి రమణ, కొక్కు గంగాధర్, పాత రమేష్, జున్ను రాజేందర్, భూమేష్, జంబుక శివ, సుంచు సురేష్ తదితరులున్నారు.